
డప్పు



భారతీయ

జానపద కథ

డప్పు

భారతీయ జానపద కథ



అనగనగా ఒక ఊళ్లో ఒక పేద మహిళ ఉండేది. ఆమెకి ఒక కొడుకు. అతడు ఎంతో మంచివాడు. అమ్మకి సహాయం చెయ్యడానికి ఎప్పుడూ సిద్ధంగా ఉండేవాడు. వాళ్ల జీవితం చాలా కష్టంగా గడిచేది, అయితే ఒకరికొకరు ఆసరాగా ఉండేవాళ్లు. అబ్బాయి బట్టలు చిరిగిపోయాయి, అతడి దగ్గర ఒక్క బొమ్మ కూడా లేదు. అయినా పిల్లవాడు సంతోషంగా ఉండేవాడు.



అయితే పిల్లవాడికి ఒకే ఒక్క కోరిక ఉండేది. అతడికి డప్పు కావాలని ఉండేది.



ఒక రోజు ధాన్యం అమ్మడానికి పట్టణం వెళుతున్న అమ్మ, “పట్టణం నుంచి నీకు ఏమైనా కావాలా?" అని అడిగింది. పిల్లవాడు కాసేపు ఆలోచించి, “అమ్మా, నాకు డప్పు తీసుకుని రాగలిగితే చాలా బాగుంటుంది. దాని ఖరీదు చాలా ఎక్కువ అని నాకు తెలుసు. కానీ, అన్నింటి కంటే దాని మీదే నాకు మనసుగా ఉంది."



పిల్లవాడు నిజమే చెప్పాడు. డప్పు కొనటానికి సరిపడా డబ్బు ఆమె దగ్గర ఉండదు. పట్టణంలో ధాన్యం అమ్మిన తరవాత తమకి తప్పనిసరిగా అవసరమైన సరుకులు కొన్ని ఆమె కొన్నది.



ఇంటికి తిరిగి వస్తూ ఆ పేద మహిళ తన కొడుకు గురించే ఆలోచిస్తూ ఉంది. కొడుకు కావాలనుకున్నది కొనలేకపోయినందుకు ఆమె విచారంగా ఉంది. ఆమె ఏడుస్తూ ఉండటంతో దారి కూడా సరిగా చూసుకోలేదు. ఆమె నడుస్తూ వింతగా అనిపించే ఒక వ్యక్తిని ఢీకొట్టింది.



"ఎందుకు ఏడుస్తున్నావు, అమ్మాయీ?" ఆ వ్యక్తి అడిగాడు.

ఆమె విషయమంతా అతడికి చెప్పింది.



వింతగా అనిపించే ఆ వ్యక్తి ఆమెకి ఒక కఱ్ఱ పుల్ల ఇచ్చాడు. "ఈ కఱ్ఱ పుల్ల నీ కొడుకుకి నచ్చుతుందేమో. దీనికి కొన్ని మహిమలు కూడా ఉండవచ్చు," అన్నాడు అతడు.

"నా కొడుకు దీనితో ఆడుకుంటాడేమో," అనుకుంది ఆ మహిళ.



ఆ కర్ర పుల్లతో ఏం చెయ్యాలో పిల్లవాడికి అర్థం కాలేదు. ఆ వింత వ్యక్తి చెప్పిన మాటలను అమ్మ అతడికి చెప్పింది.

కర్ర పుల్ల తెచ్చినందుకు సంతోషించి, ఆడుకోటానికి కొడుకు బయటకు వెళ్లాడు.



రోడ్డు పక్కన ఒక ముసలామె రొట్టెలు చేస్తూ ఉంది. రొట్టెలు కాల్చటానికి ఆమె నిప్పు రాజేస్తోంది. కానీ కట్టెలు పచ్చిగా ఉండటంతో మంట అంటుకోవటం లేదు.



చుట్టూ కమ్ముకున్న పొగ వల్ల ముసలామె కళ్లు మండుతున్నాయి. ఎందుకు ఏడుస్తున్నావని పిల్లవాడు ఆమెను అడిగాడు. “నేను మంట రాజెయ్య లేకపోతున్నాను," ముసలామె చెప్పింది.



“ఇది తీసుకో," అంటూ పిల్లవాడు తన కర్ర పుల్లను ఆమెకు ఇచ్చాడు. “ఇది నీకు ఉపయోగ పడుతుందనుకుంటా. దీనిలో మహిమ ఉందని మా అమ్మ చెప్పింది. దీని వల్ల మంట రాజుకుంటుందేమో.”



ఆ కర్ర పుల్ల పెట్టగానే మంట రాజుకుంది. ముసలామె సంతోషించి

ఆమె కాల్చిన రొట్టె ఒకటి పిల్లవాడికి ఇచ్చింది.



రొట్టె తీసుకుని పిల్లవాడు వెళుతుండగా కుండలు అమ్మే మహిళ కనిపించింది.

ఆమె చేతిలో ఉన్న బాబు ఆపకుండా ఏడుస్తున్నాడు.



“బాబు ఎందుకు ఏడుస్తున్నాడు?" పిల్లవాడు ఆమెను అడిగాడు.



“బాబుకి బాగా ఆకలి వేసింది. నా దగ్గర అతడికి పెట్టటానికి ఇప్పుడు ఏమీ లేదు," కుండలు అమ్మే మహిళ చెప్పింది. అప్పుడు తన చేతిలోని రొట్టెను పిల్లవాడు ఆ మహిళకి ఇచ్చాడు.



రొట్టె తిన్న బాబు ఏడుపు ఆపేశాడు. దాంతో చాలా సంతోషించిన ఆ మహిళ పిల్లవాడికి ఒక పెద్ద కుండ ఇచ్చింది.



కొంచెం సేపటికి పిల్లవాడు ఒక వాగు ఒడ్డుకి చేరుకున్నాడు. అక్కడ భార్యాభర్తలు ఒకరి మీద ఒకరు అరుచుకుంటున్నారు.


“మీరు ఎందుకు పోట్లాడుకుంటున్నారు?" పిల్లవాడు అడిగాడు.



“మేం బట్టలు ఉతకాలి. అయితే, ఉన్న ఒకే ఒక కుండని నా భార్య పగలగొట్టింది. కుండలో బట్టలు ఉడకబెట్టాలి. అది లేకుండా బట్టలు ఎలా ఉతకాలో నువ్వే చెప్పు?" అన్నాడు ఆ వ్యక్తి.



అతడికి సహాయపడగలనని పిల్లవాడికి తెలిసింది. తన దగ్గర ఉన్న పెద్ద కుండని అతడికి ఇచ్చాడు. “నువ్వు చాలా మంచివాడివి," అంటూ అతడు మెచ్చుకుని పిల్లవాడికి ఒక చక్కటి కోటు ఇచ్చాడు.



కొంచెం దూరం వెళ్లిన తరవాత పిల్లవాడికి గుఱ్ఱంతో ఒక వ్యక్తి కనిపించాడు. అయితే, అతడి వంటి మీద చెడ్డీ తప్పించి బట్టలు ఏమీ లేవు. అతడు తడిచి ఉన్నాడు, చలికి ఒణుకుతున్నాడు.



“మీ బట్టలు ఏమయ్యాయి? మీరు ఎలా తడిచిపోయారు?" పిల్లవాడు అడిగాడు.

“నేను మా వాళ్ల దగ్గరకు వెళుతుంటే దొంగలు నా దగ్గర ఉన్నదంతా దోచేసుకున్నారు. నా బట్టలు తీసుకుని నన్ను వాగులో పడేశారు," అని అతడు చెప్పాడు.



బట్టలు ఉతికే వ్యక్తి ఇచ్చిన కోటుని పిల్లవాడు ఆ వ్యక్తికి ఇచ్చాడు. "ఈ కోటు వేసుకుంటే వెచ్చగా ఉంటావు," అన్నాడు పిల్లవాడు.

అతడు ఆ కోటు వేసుకున్నాడు. "నువ్వు చాలా మంచివాడివి. ఈ గుర్రాన్ని నువ్వు తీసుకో," అన్నాడు ఆ వ్యక్తి.



గుర్రాన్ని తీసుకుని ఆ పిల్లవాడు వెళుతుండగా దారిలో ఒక పెళ్లి బృందం కనిపించింది – పెళ్లికొడుకు, అతడి బంధువులు, మేళంవాళ్లు ఉన్నారు. అయితే, అందరూ విచారంగా ఉన్నారు. మేలగాళ్లు తమ వాయిద్యాలను వాయించటం లేదు.






వాళ్లు ఒక చెట్టు కింద నీడలో కూర్చుని ఉన్నారు. “మీరంతా విచారంగా ఎందుకు ఉన్నారు?" పిల్లవాడు అడిగాడు.

“మేం చాలాసేపటి నుంచి గుర్రాన్ని తెస్తానన్న వ్యక్తి కోసం ఎదురు చూస్తున్నాం. నా కొడుకు ఆ గుర్రం మీద ఊరేగుతూ వెళ్లాలి,” అంటూ పెళ్లి కొడుకు తండ్రి తమ విచారానికి కారణం చెప్పాడు.



అది విన్న పిల్లవాడు పెళ్లికొడుకుకి తన గుర్రాన్ని ఇచ్చాడు. “నువ్వు మా మర్యాద కాపాడావు!" పెళ్లికొడుకు సంతోషంగా అన్నాడు.



పెళ్లికొడుకు తండ్రి మేలగాళ్లతో మాట్లాడాడు. దాంతో ఒక వాయిద్యకారుడు తన డప్పుని పిల్లవాడికి ఇచ్చాడు. “మా అందరి తరపున నీకు హృదయపూర్వక ధన్యవాదాలు. ఈ డప్పుని తీసుకో. "



డప్పుని చూసిన పిల్లవాడి ముఖం సంతోషంతో వెలిగిపోయింది. “మీ అందరికీ దండాలు! డప్పు కావాలని నేను ఎంతకాలం నుంచో కోరుకుంటున్నాను. పెళ్లి అంతా బాగా జరగాలి."



తరవాత పిల్లవాడు తన ఇంటివైపు పరుగుతీశాడు. అమ్మకి ఎప్పుడెప్పుడు డప్పు చూబిస్తానా అని అతడు ఆతృత పడుతున్నాడు. కర్ర పుల్ల ఇచ్చిన వ్యక్తి కూడా నిజమే చెప్పాడు.



ఆ కర్ర పుల్లలో ఏదో మహిమ ఉంది.

అయిపోయింది